వీధి కుక్కల వీరంగం

మంగళిగడ్డతండాలో పశువుల పాకపై దాడి

రెండు బర్రె దూడలు మృత్యువాత

యాచారం, జూలై 1 : మండలంలోని కుర్మిద్ద గ్రామానికి అనుబంధంగా ఉన్న మంగళిగడ్డతండాలో వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. తండాలోని ఓ పశువుల పాకపై ఆదివారం రాత్రి మూకుమ్మడిగా దాడి చేయగా రెండు బర్రె దూడలు మృత్యువాతపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళిగడ్డతండాకు చెందిన రత్నావత్ సేవ్యా తన పొలంలో పశువులను మేపి సాయంత్రం పాకలో కట్టేసి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున వచ్చేసరికి బర్రె దూడలను కుక్కలు పీక్కు తింటున్న దృశ్యాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు. వెంటనే పక్కనే ఉన్న స్థానికుల సాయంతో కుక్కలను అక్కడి నుంచి తరిమేశాడు. పాక లోకి వెళ్లి చూడగా రెండు బర్రె దూడలు కుక్కల దాడిలో మృతి చెందినట్లు గుర్తించి బోరున విలపించాడు. పశువులను నమ్ము కొని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, కుక్కల దాడిలో దూడలు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయినట్లు సేవ్యా వాపోయాడు. తనను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు. వీధి కుక్కల దాడి నుంచి ప్రజలను, మూగజీవాలను కాపాడాలని, దీనికోసం అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేతనాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల నిరసన

మాడ్గుల, జూలై 1 : వేతనాలు చెల్లించాలంటూ సోమవారం మండలంలోని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత ప్రభుత్వంలో వేతనాలు సకాలంలో అందగా.. ప్రస్తుతం రావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎనిమిది నెలల నుంచి జీతాలు వస్తలేవని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో పద్మావతికి వినతిపత్రం అందజేవారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సంఘం నాయకుడు రంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు షరీన్ పాల్గొన్నారు.

నేడు రైతు సేవా సహకార సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 1 : ది బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు సంఘం అవరణలో చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జి మేనేజర్ మోడెపు రాకేశ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బంధు పథకం అంశంపై చర్చించి సభ్యుల సలహాలు, సూచనలను తీసుకొని ప్రభుత్వానికి నివేదించాలనే రంగారెడ్డి జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు, సంఘం సభ్యులు, రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆర్టీసీ సేవలు మరింత చేరువగా..

- షాద్‌నగర్‌కు తొమ్మిది నూతన బస్సులు
- బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, జూలై 1 : ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని అందించడం కోసం ఆర్టీసీ సేవలను మరింత చేరువగా చేయనున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో సోమవారం తొమ్మిది నూతన ఆర్టీసీ బస్సులను, బస్టాండ్ ఆవరణలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ సేవలను విస్తృతంగా అందించాలన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, గ్రామీణ ప్రాంత ప్రజలకు సమస్య తలెత్తకుండా సమయానికి బస్సులను నడపాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం ఉంటుందని, ఎంతో శిక్షణ పొందిన డ్రైవర్లతో ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలకు గురికావొద్దన్నారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపోకు మొత్తం 17 బస్సులకుగాను 9 బస్సులు వచ్చాయని, మిగతా బస్సులు త్వరలోనే వస్తాయన్నారు. గతలో రద్దయిన బస్సులను పునరుద్ధరించడంతోపాటు కొత్త రూట్లలో బస్సులను నడపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో వారు ఎంతో సంతోషంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారన్నారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అనంతరం కొత్తూరు వరకు బస్సుల్లో ప్రయాణించి ప్రయాణికులతో మాట్లాడారు. నూతన బస్సులను ప్రారంభించడంపై పలువురు నాయకులు, ప్రయాణికులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ఉష, జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్, రఘు, భార్గవ్‌కుమార్, ఆర్టీసీ ఉద్యోగులున్నారు.

షాద్‌నగర్ నుంచి చేగూర్ వరకు కొత్త బస్సులో ప్రయాణం

కొత్తూరు : షాద్‌నగర్ నుంచి చేగూర్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సుకు కొత్తూరులో కాంగ్రెస్ నాయకులు సోమవారం స్వాగతం పలికారు. ఈ నూతన బస్సును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్‌లో ప్రారంభించారు. ఈ బస్సు షాద్‌నగర్ నుంచి బయలుదేరి నందిగామ, కొత్తూరు, తిమ్మాపూర్ మీదుగా చేగూర్ చేరుకుంటుంది. ఈ బస్సులో ఎమ్మెల్యేషాద్‌నగర్ నుంచి నందిగామ మండలం చేగూర్ వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ బస్సు ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు షాద్‌నగర్ నుంచి బయలుదేరుతుందని తెలిపారు. చేగూర్ వాసులు షాద్‌నగర్‌కు నేరుగా బస్సు నడిపించాలని చాలా రోజులుగా అడుగుతున్నారని చెప్పారు. వారి చిరకాల కోరిక నెరవేరిందని చెప్పారు. షాద్‌నగర్ నుంచి చేగూర్‌కు వయా కొత్తూరు నుంచి బస్సు నడపడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకుడు దేవేందర్ పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణలో డీసీవో ధాత్రీదేవి, దండుమైలారం సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి

రైతు బంధుపై అభిప్రాయ సేకరణ

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 1 : తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతు బంధు పథకంపై సోమవారం మండల పరిధిలోని రాచకొండ మైలారం సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమతమ అభిప్రాయాలు తెలిపారు. 10 ఎకరాల వరకు ఉన్న రైతులందరికీ రైతు బంధు అందించాలని.. అలాగే, కౌలు రైతులకు రైతుబంధు ఇవ్వాలని మరికొందరు తెలిపారు. రియల్ ఎస్టేట్ భూములతో పాటు సాగుచేయని భూములకు రైతు బంధు అందించవద్దని పలువురు తమ అభిప్రాయాలు తెలిపినట్లు రంగారెడ్డి జిల్లా సహకార సంఘం అధికారి ధాత్రీదేవి తెలిపారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దండుమైలారం సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం సహకార సీనియర్ అసిస్టెంట్ సరస్వతి, సంఘం ఉపాధ్యక్షుడు ఈశ్వర్, డైరెక్టర్లు బాలరాజు, అయ్యప్ప, అంజమ్మ, గణేష్, ప్రభాకర్‌రెడ్డి, మైసయ్య, వ్యవసాయశాఖ మండల అధికారి వరప్రసాద్‌రెడ్డి, ఏఈవో రఘు తదితరులున్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు

అధిక నిధులు కేటాయిస్తాం

రూ.47లక్షల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నంరూల్, జూలై 1 : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా కృషిచేయనున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ, తుర్కగూడ, కప్పాడు గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన సోమవారం ఎంపీపీ కృపేష్, జడ్పీటీసీ మహిపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పెద్దఎత్తున పరిశ్రమలు, ఐటీ, పారిశ్రామిక, విద్య, రక్షణ రంగాలతో పాటు మరెన్నో సంస్థలు ఏర్పాటవుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి పథంలో కొత్త పుంతలు తొక్కుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, నాయకులు మధు, శేఖర్‌గౌడ్, రవీందర్, నరేందర్, అశోక్‌గౌడ్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



కప్పాడులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, తదితరులు



విద్యుత్ శాఖ ఏఈ నరేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాలార్‌పూర్ గ్రామస్తులు

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

కడ్తాల్, జూలై 1 : మండలంలోని సాలార్‌పూర్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, సోమవారం విద్యుత్ శాఖ ఏఈ నరేందర్‌ను గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ఏఈ కార్యాలయంలో ఆయనను మాజీ ఎంపీపీ పంతూనాయక్, గ్రామ మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ కలిసి సమస్యలను వివరించారు. గ్రామంలో చినుకు పడితే కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాన కురిసినప్పుడు విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో, గ్రామ ప్రజలు ఏ పనులూ చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. అనంతరం ఇదే విషయాన్ని ఎమ్మెల్యే నారాయణరెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా, ఆయన వెంటనే విద్యుత్ శాఖ ఏడీఈతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, శ్రీశైలం, మోహన్, హరి, సూర్య, మల్లేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సరైన పోషణ

తుర్కయాంజాల్, జూలై 1 : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సరైన పోషణ లభిస్తుందని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. సోమవారం శ్రీరామ్‌నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు మేళాను నిర్వహించారు. 5 సంవత్సరాల లోపు చిన్నారులు ఎత్తు, బరువులను చూసి వారికి సరైన ఆహారం అందించాలని మంగమ్మ సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్యాణి, టీచర్ స్వప్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువును చూస్తున్న సిబ్బంది

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపొద్దు

చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం

చేవెళ్ల రూరల్, జూలై 1 : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపరాదని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్ ఫ్లైఓవర్ వద్ద ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లైకుండా వాహనాలు నడుపుతున్న వాహనాలు, నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్స్ సరిగ్గా కనబడకుండా ట్యాపరింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఇస్తే వాహన యజమాని చట్టరీత్యా బాధ్యులవుతారన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి, సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

ఫతేపూర్ ఫ్లైఓవర్ వద్ద వాహనాల తనిఖీలో పాల్గొన్న సీఐ వెంకటేశం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, జూలై 1 : మండల పరిధిలోని మక్తమాదారం గ్రామానికి చెందిన అంక్యారి బాలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ సులోచన స్థానిక నాయకులతో కలిసి బాలమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో శివగాళ్ల యాదయ్య మరణించాడు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, మహేందర్, యాదగిరి, జంగయ్య, యాదయ్య, అంజయ్య, చందు, శ్రీను, కృష్ణయ్య, చెన్నయ్య, ఎల్లయ్య, రామచంద్రయ్య, శ్రీశైలం, లక్ష్మయ్య, నర్సింహ, వెంకటయ్య, విజయ్ పాల్గొన్నారు.

రాజకీయాలపై ఉన్న శ్రద్ధ.. అభివృద్ధిపై లేదు

వివిధ కేరుల సమావేశంలో సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్, జూలై 1 : రాజకీయాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం షాద్‌నగర్‌లో వివిధ కేరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలను మోసం చేసేలా ఇష్టానుసారంగా హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలుచేసేందుకు కాలయాపన చేస్తున్నదని దుయ్యబట్టారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించకపోవడం బాధాకరమని, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుతో ప్రజా ధనం వృథా కావడంతో పాటు లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి ప్రభుత్వం మూడు పర్యాయాలు లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు చేసి తుది జాబితాను తయారు చేశారని, ఇందులో కొందరికి లాంఛనంగా ఇండ్లు కేటాయించారని, మిగతా ఇండ్లను కేటాయించే క్రమంలో ఎన్నికల కోడ్ రావడం వల్ల కేటాయింపు పూర్తిస్థాయిలో జరుగలేదనే విషయం అందరికీ తెలుసని చెప్పారు. కేవలం తమ స్వార్థ రాజకీయాల కోసం ఇండ్ల కేటాయింపును అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కోట్ల నిధులను వెచ్చించి నిర్మించిన ఇండ్లలో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయనే విషయాన్ని ప్రభుత్వం గ్రహించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పొరపాట్లు జరిగి ఉంటే మరోమారు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసి ఇండ్లను కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇండ్లను కేటాయించకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ప్రజలపక్షాన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, పెట్టుబడులు పెట్టి పదవులను పొందలేదనే విషయాన్ని అన్ని వర్గాల నాయకులు గ్రహించాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడంతో పాటు ప్రజల సమస్యలు పరిష్కార మయ్యేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని ఆయన హెచ్చరించారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 1 : మండలంలోని గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఎంపీ బుర్ర రేఖ తెలిపారు. ఉదయం 10 గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్, 10.30 గంటలకు బాటసింగారం, 11 గంటలకు ఇనాంగూడ, 11.30 గంటలకు లష్కర్‌గూడ, 12 గంటలకు కవాడిపల్లి, 12.30 గంటలకు తారామతిపేట, ఒంటి గంటకు గౌరెల్లి, 1.30 గంటలకు కుత్బుల్లాపూర్ గ్రామాల్లో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొనాలని కోరారు.

ముురుగును మూసీలో కలపండి

పెద్దఅంబర్‌పేట, జూలై 1: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామం లోకి జీహెచ్ఎంసీ నుంచి వచ్చే డ్రైనేజీ మురుగు నీటిని మూసీలో కలపాలని ఎంపీటీసీ చేగూరి వెంకటేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ నుంచి వస్తున్న మురుగు నీటిని ఇరిగేషన్ పరిధిలోని నాలాలో కలుపుతున్నారని, ఈ కారణంగా చెరువుతో పాటు చుట్టుపక్కలున్న బోర్లలో వస్తున్న ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. మురుగు నీటితో దుర్గంధం వస్తున్నదని, దోమలు పెరిగి గ్రామస్తులు అవస్థలు పడుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ మురికి నీటిని నాలాలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కృపేశ్ తదితరులు

ఐదేండ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి

పోచారంలో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 1 : మండలంలోని 14 గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఐదేండ్లలో కోట్లాది రూపాయల నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని ఇబ్రహీంపట్నం మండల పరిషత్ అధ్యక్షుడు కృపేశ్ అన్నారు. మండల పరిధిలోని పోచారం గ్రామంలో సోమవారం రూ.6లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాలను అభివృద్ధిలో ముందుకు నడిపించామని ఎంపీపీ పేర్కొన్నారు.

నూతన సీఐ శ్రీధర్, డిటెక్టివ్ సీఐ రమేశ్, బదిలీపై వెళ్లిన సీఐ లక్ష్మారెడ్డిని సన్మానించిన ఎస్సైలు

చేవెళ్ల సీఐగా భూపాల్ శ్రీధర్, డిటెక్టివ్ సీఐగా రమేశ్

చేవెళ్లటౌన్, జూలై 1 : చేవెళ్ల సీఐగా భూపాల్ శ్రీధర్, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ డిటెక్టివ్ నూతన సీఐగా రమేశ్‌నాయుడు నియమితులవ్వగా.. సోమవారం వారు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు చేవెళ్ల సీఐగా విధులు నిర్వహించిన లక్ష్మారెడ్డి బదిలీపై నగరంలోని ఉమెన్ పీఎస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన సీఐలు భూపాల్ శ్రీధర్, రమేశ్, బదిలీపై వెళ్లిన సీఐ లక్ష్మారెడ్డిని ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, సిబ్బంది సన్మానించారు.

భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీ ఎన్నిక

భారతీయ కిసాన్ సంఘ్ నూతన కమిటీకి నియామకపత్రమిస్తున్న జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్

షాబాద్, జూలై 1 : భారతీయ కిసాన్ సంఘ్ షాబాద్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం షాబాద్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దండు యాదవరెడ్డి, కార్యదర్శిగా దొనూరి కృష్ణ, కోశాధికారులుగా కలాల్ చంద్రయ్య, వడ్ల వీరేశం, సభ్యులుగా దేవి, మల్లేశ్, పర్వేద శ్రీశైలం, కృష్ణ, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, పాండు, చెన్నయ్య, వినోద, బుగ్గయ్యలను ఎన్నుకున్నట్లు చెప్పారు.



టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య జన్మదినం సందర్భంగాతుర్కయాంజాల్ మున్సిపాలిటీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేసిన సత్తయ్య అభిమానులు
- తుర్కయాంజాల్, జూలై 1

పామెనలో ఉచిత వైద్య శిబిరం

చేవెళ్ల రూరల్, జూలై 1 : చేవెళ్ల మండలం పామెన గ్రామంలో సోమవారం డా.పట్నం మహేందర్‌రెడ్డి దవాఖాన సౌజన్యంతో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మందికి అన్ని రకాల వాధ్యులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సరళ, కారోబార్ ప్రశాంత్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేడు శంకర్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం

చేవెళ్ల రూరల్, జూలై 1 : శంకర్‌పల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు, జడ్పీటీసీలు, గ్రామపంచాయతీ ఇన్‌చార్జి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కడ్తాల్, జూలై 1 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండా గేట్ వద్ద రాత్రి 10 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(45) హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. అతన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద విషయమై స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన వ్యక్తి గురించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో, పోలీసులు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి చేయిపై శివుడి పచ్చబొట్టు బొమ్మ, చూపుడు వేలికి తాబేలు గుర్తు గల ఉంగరం ఉన్నదని, ఎవరికైనా ఆచూకీ లభిస్తే 83339 93536, 94936 28100 నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పాడి రైతు మృతి

షాద్‌నగర్, జూలై 1 : పశువులకు నీళ్లను తాగించేందుకు బోరుబావి మోటర్ వేసేందుకు వెళ్లిన ఓ పాడి రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన విషాద సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాలే వెంకటేశ్(42) స్థానికంగా బర్రెలను పోషిస్తూ పాడి రైతుగా ఉపాధి పొందుతున్నాడు. ఇందులో భాగంగానే బర్రెలకు నీళ్లు తాగించేందుకు సమీప రైతు పొలం వద్ద ఉన్న బోరు మోటరును వేసేందుకు వెళ్లాడు. స్టార్టర్‌ను ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశ